

నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

- గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆదివారం గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష(5వ తరగతి నుంచి 9వ తరగతిలో ప్రవేశానికి) ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని ఎల్లారెడ్డి గిరిజన గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సావిత్రి తెలిపారు. ప్రవేశపరీక్ష రాసే విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రానికి గంట ముందు ఉదయం 9 గంటలకు వరకు చేరుకోవాలని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ బంపర్ ఆఫర్!

మున్సిపల్ అధికారులు గుర్తించిన లేఅవుట్ లేని వెంచర్



- 25 శాతం తగ్గింపుతో ఎల్‌ఆర్‌ఎస్ అమలు
- అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు అవకాశం
- కొత్త వాటికి కూడా ఛాన్స్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- వేలాది ప్లాట్లు సక్రమం అయ్యే అవకాశం
- జిల్లాలో 22 వేలకు పైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు

కామారెడ్డి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించడం, ప్లాట్ల క్రయవిక్రయాలు తగ్గడం, నాలుగేళ్లుగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన పెండింగ్‌లో ఉండడాన్ని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం దాన్ని వేగవంతం చేసే దిశగా దృష్టి సారించింది. అలాగే అక్రమ లేఅవుట్‌లలో మిగిలిన ప్లాట్లన్నింటికి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకొని వాటికి సైతం అవకాశం కల్పించడంతో పాటు మార్చి 31లోగా రెగ్యులరైజేషన్ చేసుకుంటే నిర్దేశిత ఫీజులో 25శాతం రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఇటీవల దీనికి సంబంధించి ఉత్తర్వులను జారీచేసింది. దీంతో జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం అయ్యే అవకాశం ఉంద ని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వానికి సైతం భారీగా ఆదాయం సమకూరనుంది.

22 వేలకు పైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీల్లో మొత్తం 19,894 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులురాగా గ్రామ పంచాయతీ పరిధిలో మరో 2 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలన ప్రక్రియ గత 6 నెలల నుంచి కొనసాగుతోంది. మున్సిపాలిటీలతో పాటు పంచాయతీల్లోనూ నాన్ లేఅవుట్ ప్లాట్లను లేఅవుట్ చేసుకునేందుకు దరఖాస్తుదారులు ఆసక్తి చూపలేదు. కామారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం దరఖాస్తులు 17,613 రాగా ఇందులో 6 వేల దరఖాస్తులు పరిశీలించారు. బాన్సువాడలో 1,874 దరఖాస్తులు రాగా 1250 దరఖాస్తులు పరిశీలించారు. ఎల్లారెడ్డిలో 907 దరఖాస్తులు రాగా 520 పరిశీలించారు. గ్రామ పంచాయతీలో 2 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిధిలోనూ రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు దరఖాస్తుదారులు ముందుకు రాలేదు. దీంతో ప్రక్రియ ముందకు సాగకపోవడం కాదు కదా ప్రభుత్వానికి ఆదాయం సమకూరలేదు.

అక్రమ ప్లాట్లన్నింటికీ అవకాశం

లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీంను గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. 2020 ఆగస్టు 26 వరకు రూ.1000 చెల్లించి మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఇందులో అవకాశం కల్పించింది. వేలల్లో దరఖాస్తులు రావడం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్‌లో వాటి పరిశీలనకు తగిన సిబ్బంది లేకపోవడంతో ఈ ప్రక్రియ మందకొడిగా సాగింది. దీన్ని గుర్తించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఎల్‌ఆర్‌ఎస్‌లో నిబంధనలను సడలించింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు అక్రమ లేఅవుట్‌లలో 10 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను పూర్తయి మిగితా విక్రయించకుండా ఉన్న వాటికి సైతం ప్రస్తుతం అవకాశం కల్పించింది. పెండింగ్ రెగ్యులరైజేషన్ చార్జీలతో పాటు లే అవుట్‌లో ఖాళీగా ఉన్న ప్లాట్ల విస్తీర్ణం ప్రకారం చార్జీలు ఉంటాయని పేర్కొంది. వాటి విలువను ప్రత్యేక ప్రొఫార్మాలో నమోదు చేసి పోర్టల్‌లో నమోదు చేయాలని సబ్ రిజిస్టర్‌లను ఆదేశించింది. ప్లాట్ల రిజిస్ట్రేషన్ వాల్యూ ఆధారంగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

25 శాతం తగ్గింపుతో వేగవంతం అయ్యే అవకాశం

అక్రమ లేఅవుట్‌లకు అడ్డుకట్ట వేయాలని భావించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటేనే ఆ లేవుట్‌లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించింది. దీంతో వందలాదిగా ఉన్న అక్రమ లేఅవుట్‌లలోని ప్లాట్ల క్రయ విక్రయాలన్నీ నిలిచిపోయాయి. ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడింది. మరో 2020లో ఎల్‌ఆర్ ఎస్ కోసం అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రి య మున్సిపాలిటీలతో పాటు గ్రామీణ ప్రాం తాల్లో నత్తనడకన సాగుతోంది. ఇందుకు ప్రధాన కారణం తగినంత సిబ్బంది లేకపోవడమే దీనిని గమనించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రక్రియ వేగవంతంతో పాటు అక్రమ ప్లాట్ల వేగవంతంతో పాటు మరోసారి అవకాశం కల్పించింది. వచ్చే మార్చి 31లోపు రెగ్యులరైజ్ చేసుకుంటే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ కల్పిస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ పూర్తయితే పెండింగ్‌లో ఉన్న వేలాది అనధికార అక్రమప్లాట్లు సక్రమం కానున్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు సైతం భారీగా ఆదాయం సమకూరనుంది.

కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థులు కరువయ్యారు

- రోడ్డు మీద పోయే వాడిని దొరకపట్టి పట్టభద్రుల అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించింది
- ఇక ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి అభ్యర్థులే కరువయ్యారు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని సర్వేలో తేలింది
- అందుకే ఓటుకు రూ.10 వేలు ఇచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది
- కాంగ్రెస్‌లో ఐదుగురు మంత్రులదే ఆధిపత్యం
- 15 శాతం కమీషన్ ఇవ్వందే నిధులు విడుదల చేయడం లేదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పక్కన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ అభ్యర్థులే కరువయ్యారని, రోడ్డు మీద పోయే వాడిని దొరకపట్టి పట్టభద్రుల అభ్యర్థిగా ప్రకటించిందని ఇక ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి అసలు అభ్యర్థులే లేరని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. శనివారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ వద్ద గల బృందావన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కామారెడ్డి ప్రజలు, పట్టభద్రులు, ఉపాధ్యాయులు, మేధావులను ఎవరికి ఏ విధంగా ఓటు రూపంలో దెబ్బకొట్టాలో వారికి తెలుసని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోట్లు ఖర్చు పెట్టిన మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిని ఓడించి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిని గెలిపించి జాయింట్ కిల్లర్‌గా నిలిపారని అన్నారు. ఇక రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసే అభ్యర్థులే గెలుస్తారనే తాజా సర్వేలో వెల్లడైందన్నారు. అందుకే కాంగ్రెస్ తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కరీంనగర్‌లో రూ.10 వేలు, మిగిలిన చోట రూ.7వేలు పంచేందుకు సిద్ధమైందని అన్నారు. కాంగ్రెస్ ఎన్ని కుయుక్తులు పన్నినా పట్టభద్రులు, ఉపాధ్యాయులు బీజేపీ వైపే ఉన్నారని తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలువబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏం చేసిందని కాంగ్రెస్ ఓట్లు అభ్యర్థిస్తుందని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అడ్రస్ లేదన్నారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500లు, ఆడపిల్ల పెళ్లిలకు తులం బంగారం, స్కూటీలు, రూ.4 వేల నిరుద్యోగ భృతితో పాటు ఎన్నో హామీలు బుట్టదాఖలు చేస్తున్నారని అన్నారు. రైతుభరోసా, కౌలు రైతులకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు కుంటిసాకులతో కాలం వెళ్లస్తుందని అన్నారు. కాంగ్రెస్‌లో ఐదుగురు మంత్రులదే ఆధిపత్యం నడుస్తుందని పదవి విరమణ పొందిన వారికి డబ్బులు ఇచ్చేందుకు 15శాతం కమీషన్‌లు ఇవ్వందే నిధులు విడుదల చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారని 15 శాతం కమీషన్‌లు ఇస్తేనే నియోజకవర్గాలకు నిధులు కేటాయిస్తున్నారని వాపోతున్నారన్నారు. ఇప్పటికే పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసంతృప్తిలో ఉన్నారని తెలిపారు. పైగా ఆరు గ్యారెంటీలు అమలుకాక నియోజకవర్గంలో తల ఎత్తుకొని తిరిగే పరిస్థితుల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు లేరని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి ఎన్నో ఉద్యమాలు చేసిన తనను ఫాంహౌజ్‌లో ఉండే కేసీఆర్ ఎన్నో ఇబ్బందులకు గురిచేసేలా అనేక ప్రయత్నాలు చేశారన్నారు. అలాంటి కేసీఆర్‌నే ఫాంహౌజ్ బయటకు లాక్కొచ్చిన ఘనత బీజేపీదేనని.. అలాంటిది బీజేపీ ముందు కాంగ్రెస్ పార్టీ ఎంత అని అన్నారు. ఇక రూ.50వేల కోట్లను దోచుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్ అనే స్కీంను తీసుకువచ్చారని ఇప్పటికే 25వేల కోట్లు దరఖాస్తుల రూపంలో వచ్చాయని మరో 25 వేల కోట్లనే లాగేందుకు మరో కొత్తనాటకానికి తెరలేపారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగా ఎల్‌ఆర్ఎస్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు డీఏలు, పీఆర్‌సీలు లేక 5 సంవత్సరాలు గడుస్తుందన్నారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.12లక్షల 75వేలకు ట్యాక్స్ మినహాయింపు నిస్తూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రిటైర్ ఉద్యోగులకు పింఛన్‌లు ఇవ్వాల్సి వస్తుందని మాజీ సీఎం కేసీఆర్ వయో పరిమితిని 58 నుంచి 61కి పెంచారన్నారు. ఇప్పుడున్న సీఎం రేవంత్‌రెడ్డి 61 నుంచి 65 ఏళ్లకు పెంచేందుకు సిద్ధమవుతున్నాడని అన్నారు. ఇక కులగణన పేరుతో టైంపాస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రాష్ట్రంలో 4 కోట్ల 30లక్షలకు పైగా జనాభా ఉంటే 3కోట్ల 95లక్షల ఆధార్‌కార్డులు ఉన్నాయని మరో 20 నుంచి 25లక్షల మందికి జారీ చేయాల్సి ఉందని తెలిపారు. అలాంటిది కులగణన సర్వేలో 3 కోట్ల 75లక్షల మంది ఉన్నారని ప్రకటించారని మిగిలిన 60లక్షల మంది ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ఇక నియంతపాలన చేసిన కేసీఆర్ ఎన్నో రకాలుగా తనను అవమానకరంగా అరెస్టు చేయించి ఇబ్బంది పెడితే ఇతరులెవరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయరని ఆలోచన చేశారన్నారు. ఆనాడు మా అత్తమ్మ చనిపోతే పిట్ట ముట్టడం లేదని ఇంటికి రావాలంటూ మా కుటుంబీకులు కోరితే వచ్చిన తనను అర్ధరాత్రి పోలీసులతో దాడులు చేయించి బట్టలు మార్చుకునే అవకాశం కూడా ఇవ్వలేదని రాత్రంతా అనేక పోలీసుస్టేషన్‌లు తిప్పి వేధించారని ఇప్పటికీ 109 కేసులు తనపైన ఉన్నాయని అన్నారు. వడ్ల కొనుగోలు కోసం నల్లగొండ జిల్లాకు వెళితే బీఆర్ఎస్ నేతలు రాళ్లదాడి చేసి భయపెట్టాలని చూశారని గుర్తు చేశారు. అయినా బెదరకుండా రైతుల కోసం పోరాటం చేసిన పార్టీ బీజేపీ అని, ఉద్యోగుల పక్షాన 317 జీవోకు వ్యతిరేకంగా లాఠీ దెబ్బలు తిని జైలుపాలైంది బీజేపీ కార్యకర్తలు, నాయకులు అని అన్నారు. రైతుల, ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేసినపుడు రేవంత్‌రెడ్డి, కమ్యూనిస్టులు, పీఆర్‌టీయూ, డీటీఎఫ్, ఎస్‌టీయూ నాయకులు రాలేదని కేవలం ఒక తాపస్ నాయకులు మాత్రమే వచ్చి మా పోరాటానికి మద్దతు పలికారని అన్నారు. ఇక టీఎన్‌జీవోస్ నాయకులు కొందరు తమ ప్రమోషన్‌ల కోసం మనోభావాలను కేసీఆర్ దగ్గర తాకట్టుపెట్టారని అన్నారు. ఓ టీఎన్‌జీవోస్ నాయకులు కేసీఆర్ తమను పిలిచి 3 నెలలకోసారి జీతాలు చెల్లిస్తామని ఉద్యోగులు రోడ్డు మీదకు రాకుండా చూసుకునే బాధ్యత మీదేనని బెదిరిస్తున్నారని తనతో చెప్పుకున్నారని అన్నారు. అలాంటి సమయంలో ఉద్యోగుల కోసం పోరాడితే భయపడిన కేసీఆర్ ఉద్యోగులకు 15వ తేదీ లోపు జీతాలు అందించారంటే అందుకు బీజేపీ పోరాటమే కారణమని అన్నారు. ఎన్నో పోరాటాలు బీజేపీ చేసి ప్రజలకు, రైతులకు, నిరుద్యోగులకు, ఉపాధ్యాయ, ఉద్యోగులకు అండగా నిలిస్తే. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని కాదని కాంగ్రెస్ గద్దెనెక్కించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రతీ మేధావి వర్గానికి సరైన ప్లాట్‌ఫాం దొరికిందని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తే గెలిచిన వారం రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు బీజేపీ ఆధ్వర్యంలో యుద్ధం ప్రకటిస్తామని అన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం పోరాడిన పార్టీ బీజేపీ అని అధికారం కోసం పాకులాడకుండా పోరాటం చేసి ప్రజలకు అండగా నిలిచిన పార్టీకి మద్దతు ప్రకటించాలని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కోరుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎంపీ బీబీపాటిల్, మాజీ అధ్యక్షురాలు అరుణతార, నాయకులు ఎన్‌వీఎస్ఎస్‌ప్రభాకర్, హైమారెడ్డి, మురళీధర్‌గౌడ్, బాణాల లక్ష్మారెడ్డి, పైడి ఎల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, విపుల్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



బీటీఎస్ చౌరస్తా వద్ద విద్యుత్ లైట్లను ప్రారంభిస్తున్న దృశ్యం

బీటీఎస్ వద్ద విద్యుత్ లైట్ల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దోమకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'చీకట్లోనే ప్రయాణాలు.. మహిళలకు తప్పని తిప్పలు' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో గత వారం రోజుల క్రితం ప్రచురితమైంది. ఈ కథనానికి బీబీపేట మండలంలోని జనగామ గ్రామానికి చెందిన తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి స్పందించారు. బీటీఎస్ చౌరస్తాలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. రూ.50 వేలతో బీటీఎస్ చౌరస్తాలో విద్యుత్ స్తంభానికి గురువారం గుంతను తవ్వి పనులను ప్రారంభించారు. కాగా శనివారం లైట్లను దోమకొండ మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డి, బీబీపేట మాజీ వైస్ ఎంపీపీ రవిందర్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, బాబు,సాయి కుమార్, రాజులు ప్రారంభించారు.

జీఎస్ఆర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ నిలిపివేత

- ఈ ఏడాది మూడు లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్



జీఎస్ఆర్ చెరుకు కర్మాగారం ఇదే..

నిజాంసాగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం మాగి గ్రామ శివారులో ఉన్న కర్మాగారంలో చెరుకు క్రషింగ్‌ను ఫ్యాక్టరీ యాజమాన్యం శనివారం అర్ధరాత్రి నుంచి నిలిపివేశారు. దాదాపు మూడు నెలల 18 రోజుల పాటు జీఎస్ఆర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ జరిగాయి. ఇప్పటి వరకు చెరుకు కర్మాగారంలో మూడు లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల చెరుకును గానుగా ఆడించారు. కర్మాగారం నవంబరు 4వ తేదీ నుంచి ప్రారంభమై 22 ఫిబ్రవరి శనివారం నాటికి ముగిసింది. చక్కెర కర్మాగారం నారాయణఖేడ్ జోన్ పరిధిలోని నాగలిగిద్ద, మన్నూర్ నారాయణఖేడ్‌తో పాటు జహీరాబాద్ ప్రాంతం నుంచి అధికంగా రైతులు చెరుకును కర్మాగారానికి తరలించారు. కర్మాగార యాజమాన్యం టన్నుకు రూ.3,682 చెల్లించింది. జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని రైతులు కూడా చెరుకును తరలించారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రంజాన్‌కు అన్ని రకాల ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీతో కలిసి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసం ఉపవాస దీక్షలు మార్చి 2 నుంచి ప్రారంభం సందర్భంగా తాగునీరు, శానిటేషన్, నిరంతర విద్యుత్ సరఫరా, వీధిలైట్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బోర్లు, పైప్‌లైన్ మరమ్మతులు ఉంటే ముందస్తుగా చేపట్టాలని తెలిపారు. ప్రతీ సంవత్సరం చేసేవిధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అదనపు నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులకు తెలిపారు. నమాజ్ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈకి సూచించారు. రంజాన్ పండుగ నేపథ్యంలో అదనంగా అవసరాల మేరకు పాల సరఫరా అయ్యేవిధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వంటగ్యాస్ అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు చక్కెర అదనపు కోటా సరఫరా చేయాలని పౌర సరఫరాల అధికారులకు తెలిపారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ జిల్లాలోని మసీదుల వద్ద శాంతి భద్రతలను పోలీసు యంత్రాంగం పర్యవేక్షిస్తుందని తెలిపారు. పండుగ నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుం దని తెలిపారు. సుహృత్ భావంతో పండుగను నిర్వహించుకోవాలని తెలిపారు. మతపెద్దలు మాట్లాడు తూ తెల్లవారు జామున ప్రార్థన సమయానికి ముందే నీటి సరఫరా చేయాలని కోరారు. మసీదుల వద్ద షెడ్‌నెట్‌లను, వీధిలైట్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. పండుగ సామాన్ల కొనుగోలుకు రాత్రివేళలో దుకాణాలు ఉండేవిధంగా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు ఎస్పీ చైతన్యారెడ్డి, అదనపు కలెక్టర్‌లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకుని ఎన్నికల మెటీరియల్ తీసుకోవాలి

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కేటాయించిన సిబ్బంది సకాలంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకుని ఎన్నికల మెటీరియల్ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది, జోనల్ అధికారులకు రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది సకాలంలో ఎన్నికల సామగ్రి తీసుకునేందుకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకోవాలని, ఎన్నికల సామగ్రి సేకరించి పరిశీలించుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులకు హాజరుకాని సిబ్బందిపై ఎన్నికల నియమావళి మేరకు సంబంధిత సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఏమైన సందేహాలు, సమస్యలు ఇబ్బందులు ఉంటే శిక్షణ సమయంలో నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ సమయంలో బ్యాలెట్ బాక్స్ సీలింగ్ ప్రక్రియ ప్రాక్టికల్‌గా నిర్వహించి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణపై మాస్టర్ శిక్షకులు శిక్షణ అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్‌లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ సురేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, సీపీవో రాజారాం తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన



మోస్రాలో వైజ్ఞానిక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మోస్రా,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆగస్త్యా సంస్థ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక కేంద్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ముప్పై రకాల పలు ప్రదర్శనలను ఉపాధ్యాయులు వీక్షించి విద్యార్థుల తెలివితేటలు మెచ్చి అభినందించారు. అదే విధంగా ఆగస్త్యా సంస్థ తరఫున పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, ఆగస్త్యా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అబ్బాపూర్(ఎం)గ్రామ సందర్శన



చిరుతపులి అడుగులను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

నవీపేట,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(ఎం)గ్రామాన్ని శనివారం సాయంత్రం అటవీశాఖ అధికారులు సందర్శించారు. గురువారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన బెల్లి అబ్బయ్య అనే రైతుకు చెందిన రెండు లేగదూడలను చిరుత పులి దాడి చేసి చంపి వేసిన విషయం విదితమే. దీంతో అటవీశాఖ అధికారులు చిరుతపులి జాడను కనిపెట్టడానికి గ్రామాన్ని సందర్శించారు. చిరుత పులిని బంధించడానికి గ్రామ శివారులో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు త్వరలో బోనును ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ జహుర్, బీట్ ఆఫీసర్ సుధీర్, సిబ్బంది ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థులకు మెను ప్రకారంగా భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. శనివారం పట్టణంలోని రాజారాంనగర్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో రుచికరమైన భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. విద్యార్థులకు కనబడేలా మెనును ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.

సైబర్‌నేరాల నియంత్రణపై అవగాహన

నవీపేట,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్ లో శనివారం సైబర్ నేరాల నియంత్రణపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫోన్ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు మహేష్, భాస్కర్, గ్రామస్థులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంపీవో

వేల్పూర్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం తీరును శనివారం ఎంపీవో సాయిలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వండే వంట పాత్రాలను, కూరగాయలను పరిశీలించారు. వంటకాలకు సంబంధించి వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ రుచికరమైన వంటలను విద్యార్థులకు అందించాలని సూచించారు. ప్రభుత్వ మెను ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు.

బట్టాపూర్‌లో ఆరు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్



పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్లు

ఏర్గట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బట్టాపూర్ గ్రామంలో శనివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను ఒక జేసీబీని పోలీస్‌లు సీజ్ చేశారు. ఈ విషయమై స్థానిక ఎస్సై బీ.రామును వివరణ కోరగా బట్టాపూర్ గ్రామ శివారులో ఎలాంటి వేబిల్ లేకుండా ఉన్న ఇసుక ట్రాక్టర్‌లను పెద్దవాగు సమీపంలో ఒక జేసీబీని గుర్తించి సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

శివరాత్రికి వేములవాడకు ప్రత్యేక బస్సు సౌకర్యం

పెర్కిట్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారు శివరాత్రికి వేములవాడకు ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసిందని ఆర్మూర్ డిపో మేనేజర్ పి.రవికుమార్ తెలిపారు. ఆర్మూర్ నుంచి వేములవాడకు ఈనెల 25, 26, 27తేదీలలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఈ బస్సులలో మహాలక్ష్మీపథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కలదని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం సుఖవంతమైన సుభప్రదమైన ప్రయాణాన్ని చేయాలని తెలిపారు.

స్టీల్ ప్లేట్ల వితరణ

పెర్కిట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంబి హన్మాన్ ఆలయ ప్రాంగణంలో ప్రతీ శనివారం నిర్వహించే అన్నప్రసాద కార్యక్రమానికి ఆలయకమిటీ డైరెక్టర్ దొండి రమణ స్టీల్ ప్లేట్లను వితరణ చేశారు. జంబిహన్మాన్ ఆలయానికి స్థానిక భక్తులే కాకుండా ఇరుపక్కల ప్రాంతాల వారు మెట్‌పల్లి, కోరుట్ల, నందిపేట, డిచ్‌పల్లి నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శనం చేసుకుంటున్నారు. అదే విధంగా ప్రతీ శనివారం ఆలయంలో అందించే అన్నప్రసాదాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్టీల్ ప్లేట్ల కొరత ఏర్పడడంతో అన్నప్రసాద కార్యక్రమానికి స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశామని తెలిపారు. శనివారం నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ డైరెక్టర్‌గా నియమించినందుకు గాను ఆర్మూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డికి దొండి రమణ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, గోపిగౌడ్, నారాయణరెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ప్రశాంత్ ఆరోపణలు అర్థరహితం'



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 22:(ఆంధ్రజ్యోతి) పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పసుపు రైతులను మోసం చేసింది. సకాలంలో రుణమాఫీ చేయకుండా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందించని కారణంగా 12 వంద మంది రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నది. కేసీఆర్ పాలనలో కాదా వాటిని కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అసత్య ఆరోపణలకు దిగుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బాసవేణుగోపాల్ యాదవ్ విమర్శించారు. ప్రజానిలయంలో శనివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పసుపు ధర క్వింటాలుకు రూ.5 వేలే దాటలేదని పసుపు రైతులకు కటఫ్‌రేట్ పెట్టకుండా రైతులను నట్టేట ముంచింది మీరుకాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో పుసుపు రైతులను ఆదుకోవాలన్న తపనతో రేవంత్ రెడ్డి క్వింటాలు కొమ్ములకు రూ.10వేలు తగ్గకుండా తగు నిర్ణయాలు తీసుకున్నారని, మండకు కటఫ్ రేట్ రూ.9వేలు ధర తగ్గకుండా పసుపు రైతులపు ఆదుకునే నిమిత్తం చర్యలు తీసుకుంటే మరో పక్క సీఎం రేవంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు గుప్పిచడం సరకాదన్నారు ఇప్పటికైనా అసత్య ఆరోపణలకు స్వస్తి పలకాలని హితవుపలికారు. సమావేశంలో కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, దేవారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, రాజా ముత్యం, పల్లె శేఖర్, చరణ్ ముదిరాజ్, కుందారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రిజిస్టర్ కోసం కార్యాచరణ

నవీపేట,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామంలో ఉన్న ఎర్రకుంట రిజర్వాయర్‌లో నూతనంగా మత్స్యకారుల కోరిక మేరకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రిజిస్టర్ చేయడానికి తగిన కార్యాచరణ చేపట్టడం జరిగిందని జిల్లా మత్స్యశాఖ అధికారి అంజనేయ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అబ్బాపూర్(ఎం), అభంగపట్నం గ్రామాల మధ్యన ఉన్న సుమారు 4, 5 చెరువులను కలిసి 2016సంవత్సరంలో ఎర్రకుంట రిజర్వాయర్‌గా నిర్మించబడిందని ఆయన పేర్కొన్నారు. ఈ రిజర్వాయర్ అబ్బాపూర్(ఎం)కు చెందిన సుమారు 300ఎకరాలు, అభంగపట్నంకు చెందిన 90ఎకరాల వరకు విస్తరించి ఉందని ఆయన పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు అబ్బాపూర్(ఎం) గ్రామంలో 404, అభంగపట్నంకు చెందిన 10 గూండ్ల, గంగపుత్ర కులానికి చెందిన మత్స్యకారులు ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో చేపల పట్టివేతపై ఆధారపడిజీవిస్తున్నారని అన్నారు. మైనర్ ఇరిగేషన్ కేటగిరికి చెందిన ఈ నీటి వనరులపై ఆధారపడి బ్రతకడానికి రెండు గ్రామాల్లో ఉన్న మత్స్యకారులతో గతంలో ఉన్న సహకార సంఘం 2022లో రద్దు అయిందని ఆయన పేర్కొన్నారు. నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేయడానికి మత్స్యకారుల నుంచి దరఖాస్తులు కోరడం జరుగుతుందని అబ్బాపూర్(ఎం), అభంగపట్నం గ్రామాలలో చేపల వేట వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నానో యూరియా పర్యావరణ పర్యవేక్షణకు తోడ్పడుతోంది

వేల్పూర్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి):నానో యూరియా పర్యావరణ పరిరక్షణ ఎంతగానో తోడ్పడుతుందని, శనివారం వేల్పూర్ తీగెల బాల్‌రెడ్డి రైతు వ్యవసాయ క్షేత్రంలో యాల్ల ప్రవీణ్‌కు చెందిన డ్రోన్ సహాయంతో నానో యూరియ వాడకంపైన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శృతి మాట్లాడుతూ నానో యూరియాను పంట ఆకులపైన పిచికారి చేయడం వల్ల నత్రజని సోషణ ఎక్కువగా ఉండి పంట మెరుగైన పెరుగుదల, ధాన్యం ఉత్పత్తి, పంట నాణ్యతకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానోయూరియా ఘనపరిణమం అతితక్కువగా ఉండి ఎక్కువ ఉపరితల వైశాల్యం కలిగి ఉంటుందన్నారు. దాని వల్ల యూరియా క ణాలు పంటకు సులభంగా అందుబాటులో ఉంటాయన్నారు. సాంప్రదాయ యూరియతో పోలిస్తే దీని వాడకం వల్ల ఏలాంటి పర్యావరణ కలుష్యం ఉండ దన్నారు. వాతావరణ మార్పులకు కారణమయ్యే వ్యవసాయ క్షేత్రాల నుంచి వచ్చే బ్లీచింగ్, వాయు ద్వారా రూపంలో పోషక నష్టాన్ని తగ్గించడం జరుగు తుందన్నారు. నానో యూరియా వాడకం వల్ల పంట దిగుబడి ఎనిమిది శాతం పెరుగుతుందన్నారు.సాంప్రదాయ యూరియా 45కిలోల బస్తా ధర రూ.268లు కాగా 500మిల్లీలీటర్ల నానో యూరియా బాటిల్ ధర కేవలం రూ. 225మాత్రమే ఉంటుందన్నారు. నానో యూరియా బాటిల్ సమర్థవంతంగా భర్తీ చేస్తుందని దీని వాడకాన్ని రైతులు అలవాటు చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెల్స్‌మెన్ సతీష్ రైతులు గంగారెడ్డి, బాల్ రెడ్డి, యాల్ల ప్రవీణ్, తదితరులు ఉన్నారు.



వేల్పూర్‌లో డ్రోన్‌తో పిచికారి చేస్తున్న అధికారులు

కుంభమేళా నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- 12మంది శివస్వాములకు తీవ్రగాయాలు
- హైదరాబాద్, నిజామాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స
- క్షతగాత్రులు యాదాద్రి జిల్లా వాసులు

మెండోర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కుంభమేళా నుంచి తిరిగి వస్తుండగా 12 మంది శివస్వాములు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మెండోర మండలం బుస్సాపూర్ 44వ జాతీయరహదారిపై శనివారం వేకువజామున జరిగిందని ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల పరకారం యాదాద్రి జిల్లా చాడ గ్రామానికి చెందిన శివస్వాములు ప్రయాణిస్తున్న వాహనం కుంభమేళా వెళ్ళి తిరుగు ప్రయాణంలో బుస్సాపూర్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. వీరి వాహనం ముందు టమాటల లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనం డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల డివైడర్‌కు ఢీకొట్టింది. వెనకాల ఉన్న శివస్వాములు వాహనం ముందు ఉన్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టడంతో వాహనంలో ఉన్న స్వాములకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడ్డ వారిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ శివస్వాములు

మంచి నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): పట్టణానికి మంచినీటి సరఫరా అయ్యే మంచినీటి శుద్ధి కేంద్రాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. రాబో యే వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తచర్యగా బాల్కొండ మం డల కేంద్రంలో ఉన్న మంచినీటి శుద్ధి కేంద్రాన్ని మరమ్మతులను చేయించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ భూమేశ్వర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యాసంస్థలను రద్దు చేయాలి

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థలను రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు శనివారం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం వందలాది మంది విద్యార్థులు శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని శుక్రవారం ఖమ్మంలో శ్రీచైతన్య విద్యా సంస్థలో చదువుతున్న యోగనందిని అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని ఈ ఆత్మహత్యకు ఆకరణమైన వారిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి 50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. అనుమతులు లేకుండా వందల సంఖ్యలో నిర్వహిస్తున్న శ్రీచైతన్య బ్రాంచ్‌లను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రిన్స్, నిఖిల్, విజయ్ పాల్గొన్నారు.

'ప్రముఖుల చరిత్ర చదవాలి'

మోస్రా,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో నలంద విద్యానిలయం పాఠశాలలో సగర్వంగా అత్యంత విజయవంతమైన పాజిటీవ్ పేరెంటింగ్ సెషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ తిరునగరి శ్రీహరి, మాదం మహిపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం, వివేకానంద జీవితాల గురించి వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు గుత్ప లక్ష్మారెడ్డి, రేఖ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సహకార సంఘం నష్టాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- ఎత్తొండ సంఘ సభ్యుల డిమాండ్

కోటగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో జరిగిన నష్టాలపై సమగ్ర విచారణ జరపాలని ఎత్తొండ మాజీ అధ్యక్షులు అశోక్ పటేల్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం సంఘ సభ్యులతో కలిసి విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం 2017-18 నాటికి సుమారు 7.50 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అదే సమయానికి సుమారు కోటి 16 లక్షల రూపాలయల నష్టాల్లో ఉందన్నారు. 2013-14 లో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తమ సిబ్బంది మీద ధాన్యం కొనుగోలు చేసినట్లు ట్రాక్‌షీట్ రాసినట్లు ఉందన్నారు. ఈ విలువ సుమారు 74 లక్షలు సిబ్బంది ఖాతాలో జమచేసి ఆ మొత్తాన్ని ఎటు మళ్లించారో తెలియదన్నారు. 2018 వరకు కొనసాగిన పాలకవర్గాన్ని రద్దుచేసి పాలకవర్గ బాధ్యతలు అధికారులకు అప్పగించారని వారు అన్నారు. తమ పాలకవర్గం బాధ్యతలు తీసుకునే సమయానికి సంఘంలో కేవలం 2.50 కోట్ల ధాన్యం నిలువ ఉన్నట్లు తమ దగ్గర ఆధారాలు ఉన్నాయన్నారు. తడిసిన ధాన్యం మిల్లింగ్ చేసి సివిల్ సప్లైకి పంపించామన్నారు. గత పాలక వర్గం చేసిన అప్పులను వడ్డీతో సహా చెల్లిస్తూ వచ్చామని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యు లు లింగయ్య, శ్రీనివాసరావు, గంగాధర్. పోశెట్టి ఉన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

మోర్తాడ్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లి గ్రామానికి చెందిన పండ్లబీమన్న(55) అనే వ్యక్తి చెరువులో స్నానానికి వెళ్ళి ప్రమాదవశాత్తు మతి చెందాడని ఎస్సై విక్రం తెలిపారు. కూలీ పని చేసుకునే బీమన్న స్నానం చేయడానికి వెళ్ళి చనిపోయాడని ఆయన తమ్ముడు రాజన్న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి

ఎడపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎడపల్లి ఎం పీవో మన్మోహన్ శర్మ పేర్కొన్నారు. శనివారం జానకంపేట, ఎడపల్లి గ్రామాలలో పన్నుల వసూళ్ల కోసం పంచాయతీ కార్యదర్శులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపులోగా వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ ఇంటి పన్నులు చెల్లించాలని కోరారు. పన్నుల చెల్లింపుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమనారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, ఉదయ్ భాస్కర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల అందజేత

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విపి ఉన్నతన్ ఫౌండేషన్ ఫౌండర్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు స్టడీ చైర్‌లను దాత విపి ఉన్నతన్ ఫౌండేషన్ ఫౌండర్ ఎన్‌ఆర్‌ఐ ఆనందవల్లి అందజేశారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు క్రీడా దుస్తులతో పాటు రూ.45వేల క్రీడా సామాగ్రిని, రూ.21వేల విలువ గల 25స్టడీ చైర్‌లను ఆనందవల్లి పాఠశాల విద్యార్థులకు అందజేశారు. వచ్చే విద్యసంవత్సరానికి గాను గణితశాస్త్ర ల్యాబ్‌కు అవసరమైన పరికరాలను అందజే స్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గంగజమున, పీఆర్‌టీయు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అశోక్, మండల అధ్యక్షుడు గోపి, ప్రధానకార్యదర్శి రవీన్, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్ పాల్గొన్నారు.

'నిరంతరంగా విద్యుత్తు సరఫరా'

ఎడపల్లి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం బోధన్ డివిజన్ విద్యుత్ డీఈ ముక్తార్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బందులు కాకుండా నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, ఏఈ కిషోర్ రెడ్డి, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ లైన్‌మెన్ పవన్ కుమార్. జూనియర్ లైన్‌మెన్ లక్ష్మన్, హన్మాండ్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

కోటగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : కోటగిరి మండలంలోని వల్లభాపూర్ గ్రామంలో శనివారం ఇసుక లారీలను గ్రామస్థులు అడ్డుకున్నారు. సాలూర మండలం మందర్న ఇసుక క్వారీ నుండి ఇసుక ఓవర్ లోడ్‌తో వల్లభాపూర్ మీదుగా వెళుతుండడంతో ఇంట్లోకి దుమ్ము, ధూళి చేరి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గత వారం రోజుల నుంచి ఇళ్లలోకి దుమ్ము, ధూళి చేరి అనారోగ్యాల పాలవుతున్నామని వాపోయారు. రోడ్డుపై నీళ్ళు చల్లి దుమ్ము, ధూళి రాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ వాటర్ ట్యాంకర్‌తో నీళ్ళు చల్లడంతో గ్రామస్థులు శాంతించారు.

నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్ష 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు నేడు ధర్మారం గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవి లత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9గంటల లోపు కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్, బ్లూ,బ్లాక్, పరీక్ష ప్యాడు లను వెంట తెచ్చుకోవాలని ఆమె సూచించారు. హాల్ టికెట్ లో తప్పులు ఉంటే విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల బోనాఫైడ్ లేదా ఆధార్ కార్డు పరీక్ష కేంద్రంలో చూయించాలని తెలిపారు

పదో తరగతి విద్యార్థులకు టీ శాట్ ద్వారా అవగాహన

- విద్యాశాఖ వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఆర్‌జేడీ



టీ శాట్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌జేడీ

ముప్కాల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి):బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో టీ శాట్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు విద్యశాఖ వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఆర్‌జేడీ ద్వారా విద్యార్థులకు పదవ తరగతిలో ఎలాంటి ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు ఎలా ఎదుర్కొవాలో ఆయన వివరించారు. విద్యశాఖ సెక్రెటరీ యోగితారాణా విద్యార్థులకు ప్రత్యేక సందేశాన్ని ఇచ్చారు. పదో తరగతిలో వందకు వంద శాతం వచ్చే విధంగా సబ్జెక్టు వారిగా విశ్లేషకులు వారికి అవగాహన కల్పించారు. పరీక్షలలో ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా, ఆనందంగా పరీక్షలు రాయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్‌ఎం ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల భద్రతపై రైతులకు అవగాహన



ఆలూర్ పొలంబాటలో మాట్లాడుతున్న డీఈ రమేష్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ టెక్నికల్ రమేష్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్ల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు, రైతులు స్విచ్‌బోర్డు, మోటర్ స్టార్టర్‌ల వద్ద భద్రత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల గద్దెల ఎత్తు పెంచుతామన్నారు. హర్వెస్టర్‌ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశమున్న ప్రదేశాలతో పాటు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్‌లను సరి చేస్తున్నామన్నారు. దీని వల్ల ప్రమాదాలను నివారించగలుగుతామన్నారు. రైతులకు మరింత నాణ్యమైన సేవలందించడానికి సంస్థ కృషి చేస్తుందన్నారు.ఈకార్యక్రమంలో ఏఈవో శ్రావణ్‌కుమార్, లైన్‌మెన్‌లు గంగాధర్, రమేష్, సత్యనారాయణ, నరేష్, రైతులు విజయ్, పురుషోత్తం, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముత్యాల సునీల్

ఏర్గట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జితేందర్ నరేందర్ వాళ్ల తండ్రి నరేందర్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా శనివారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాలె శ్రీనివాస్, గొల్కొండ మల్లేష్‌లు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో డ్రైవింగ్ స్కూల్ ప్రారంభం



డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించిన దృశ్యం

మోర్తాడ్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డ్రైవింగ్ స్కూల్‌ను శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు డ్రైవింగ్ స్కూల్ ద్వారా నేర్చుకొని డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని అన్నారు. డ్రైవింగ్ స్కూల్ యాజమాని నజీర్ గతంలో 410 మందికి శిక్షణ ఇచ్చిన అనుభవంఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, నజీర్, పుప్పాల అశోక్, హర్షద్, గిర్మాజీ గంగాధర్, పుప్పాల అశోక్, జక్కం అశోక్, పాషా, మహిపాల్, సతీష్, జైడి చిన్న గంగారాం, గురువయ్య, షదీక్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.వేణుప్రసాద్ తెలిపారు. శనివారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ డబ్ల్యుఈసీ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, మెనిస్ట్రావ్ హైజీన్ అనే అంశంపై అవగాహన కల్పించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ అలేఖ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.సునీత, వజ్రభాను, అధ్యాపకులు,పాల్గొన్నారు.

నవీపేటలో బైక్ చోరీ

నవీపేట,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం రెంజల్ మండలం దూపల్లికి చెందిన జిన్న సాయిలుకు చెందిన బైక్ చోరీకి గురైంది. వారంతపు సంతకు వచ్చిన ఆయన తనపై బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి ఉంచి సంతకు వెళ్లగా తిరిగి వచ్చే సరికి బైక్ మాయమైంది. తన హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్ చోరీ విషయంపై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని బాధితుడు పేర్కొన్నారు.

చెత్తను మున్సిపల్ ట్రాక్టర్‌కు అందించాలి



మహిళలకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో రోడ్లపై చెత్త పరవేయకుండా ప్రతీఒక్కరు మున్సిపల్ ట్రాక్టర్‌కు అందించాలని మున్సిపల్ సానిటరి ఇన్స్‌పెక్టర్ గజానంద్ ప్రజలను కోరారు. శనివారం పట్టణంలోని 13వార్డులో మహిళలకు., అలాగే ప్రజ్ఞ హైస్కూల్‌లో విద్యార్థులకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఇంట్లోనే తడిపొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ ట్రాక్టర్‌కు అందించాలన్నారు. అలాగే వీదికుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ నర్సయ్య, మెప్మా సీవో రాజలింగం, ఆర్‌పీ సత్య, తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

• శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ధర్పల్లి

ఆంధ్రజ్యోతి: గ్రామంలో రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

కార్యదర్శి: ప్రతీరోజు గ్రామంలో ఉదయం, సాయంత్రం నల్లాల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నీటి ఎద్దటి ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామంలో పారిశుధ్యలోపంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వస్తున్నాయి కదా?

కార్యదర్శి: సఫాయి కార్మికుల కొరత ఉంది. అయినప్పటికీ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రతీరోజు నిర్వహిస్తున్నాం. సాధ్యమైనంత వరకు పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇంటి పన్ను బకాయి వసూలు ఏ విధంగా ఉన్నాయి?

కార్యదర్శి: గ్రామంలో 35లక్షల మేర ప్రతియేటా ఇంటి పన్ను రూపంలో గ్రామ పంచాయతీకి సమకూరనుంది. మార్చి లోపు గ్రామస్తులు తమ తమ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: గ్రామంలో ఉపాధి హామీ కింద ఏ పనులు చేపడుతున్నారు?

కార్యదర్శి: గ్రామంలో 1300లకు పైగా జాబ్ కార్డులు కలిగిన కూలీలు ఉన్నారు. కూలీల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయంతో కూలీల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేస్తున్నారా?

కార్యదర్శి: ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల సూచనల మేరకు క్రమం తప్పకుండా వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేస్తున్నాం. నీటి ఎద్దడి ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసి గ్రామస్తులకు ఎలాంటి నీటి కొరత లేకుండా చూస్తాం. గ్రామస్తులు గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించాలి.

•(ఆంధ్రజ్యోతి, ధర్పల్లి)



ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అంక్సాపూర్ హన్మాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

వేల్పూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హన్మాన్ ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం దాసంజనేయ నవగ్రహ శివ పంచయతన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా 23న (ఆదివారం) రోజున హంపి వీరూపాక్ష విద్యరణ్య భారతిస్వామి శ్రీ జగద్గురు శంకరచార్యులు కరకములచే విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు. అందు కోసం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపతిపూజ, స్థాపిత దేవత హోమం, అంతకు ముందు గ్రామంలోని ప్రధాన వీదులగుండా విగ్రహాల ఊరేగింపు, పుణ్య హవచనం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠా, గణపతి హోమం, విగ్రహ జలాధివాసం, హారతి, తీర్థప్రసాద వితరణ, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు పురోహితులు అవధాని సుదీర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

రామారెడ్డి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన పోతుల బాపు రెడ్డి కుమారుడు దయాకర్ రెడ్డి అన్నదానం కోసం రూ. 11116 (పదకొండు వేల ఒక వంద పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. శనివారం ఆలయానికి చేరుకుని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ నారెడ్డి మహిపాల్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి రాజకీయ నాయకులు, వైద్యులు, వ్యాపారులు కృషి చేయాలని ఆలయ కమిటీ చైర్మెన్ మహిపాల్‌రెడ్డి వివరించారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



మామిడిపల్లిలో స్కూల్ పక్కన, నివాసాల మధ్య ఎలక్ట్రిక్ వ్యర్థాలను కాల్చివేస్తున్న దృశ్యం



స్కూల్ పక్కనే పాత సామగ్రి డంప్ చేస్తున్న దృశ్యం

ఎలక్ట్రిక్ వ్యర్థాలు కాలుస్తూ ఆరోగ్యాలతో చెలగాటం

పెర్కిట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని విలీన గ్రామాలు మామిడిపల్లి, పెర్కిట్ సమీపంలో గల విజయ్ హైస్కూల్ గ్రౌండ్ పక్కన పాత సామగ్రి డంప్‌ను కొందరు వ్యక్తులు ఏర్పాటు చేశారు. ఈ డంప్‌లో ఎలక్ట్రిక్ వస్తువులు ఇతర పాడైపోయిన, విరిగిపోయి నిరుపయోగ వస్తువులు సేకరించి ఈ స్థలంలో డంప్ చేస్తారు. అందులో కొన్ని పాడైపోయిన కూలర్లు, ఎలక్ట్రిక్ వస్తువులు రాత్రి సమయంలో కాల్చివేస్తున్నారు. కాల్చడం వల్ల ఈ మంటల నుంచి దట్టమైన పొగలు రావడంతో చుట్టు పక్కల ప్రాంతాల నివాస సముదాయాలోని ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపిల్లలు దగ్గు, దమ్ముతో బాధ పడుతున్నారు. ఎలక్ట్రిక్ కాల్చడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే డంప్ చేసిన సామాగ్రిని ఏ నిర్మానుష్య ప్రాంతాలకు తరలించాలని నిర్వాహకులకు ప్రజలు కోరగా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో మున్సిపల్ అధికారులకు తెలిపిన నామ మాత్రంగా మున్సిపల్ జవర్‌లు పంపి వదిలేశారు. కానీ డంప్ నిర్వాహకుడు ప్రతీ రోజు రాత్రి వేళల్లో ఎలక్ట్రిక్ వ్యర్థాలను కాల్చు తూనే ఉన్నారు. అందువల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతు న్నా రు. అధికారులు, స్థానిక నాయకులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్న పిల్లలకు శ్వాసకోస వ్యాధి వచ్చే అవకాశం ఉంది

• రాకేష్, స్థానికుడు, ఆర్మూర్

పాత ఎలక్ట్రిక వ్యర్థాలు, కూలర్‌లు వంటి నిరుపయోగ వస్తువులు రాత్రి సమయంలో కాల్చుతున్నారు. వాటి నుంచి దట్టమైన పోగలు వ్యాప్తి చెందిన చిన్నారులకు ఇది వరకే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. చిన్న పిల్లలు పలుమార్లు జబ్బుల భారిన పడ్డారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎలాంటి చర్యలు తీసు కోలేదు. డంప్ చేసిన నిర్వాహకులు ఓ ప్రజాప్రతినిధికి దగ్గర బంధువుగా చెబుకుంటు వెళ్ళిన వారిపై దుర్భాషలాడారు. వెంటనే అధికారులు స్పందించి డంప్ చేసిన వస్తువులను తొలగింపజేయాలని కోరుతున్నాం.

అధ్వానంగా మారిన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారి

● దారుణంగా ఉన్న రోడ్డుకు మరమ్మతు చేయని దుస్థితి ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



అధ్వానంగా మారిన ఇసన్నపల్లి గ్రామం మీదుగా మద్దికుంట గ్రామానికి వెళ్లే రోడ్డు



ధ్వంసమైన ఇసన్నపల్లి - మద్దికుంట వెళ్లే రోడ్డు

రామారెడ్డి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం నుండి ఇసనపల్లి గ్రామం మీదుగా బీటీ రోడ్డుపై మద్దిగుంట అడవి ప్రాంతంలో వెలిసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈనెల 26న బుధవారం మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్వయంభు బుగ్గ రామ లింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు లక్షకు పైగా సంఖ్యలో తరలివెళ్తారు. రో డ్డు చెడిపోవడంతో ఎలాంటి ప్రమాదాలు గురవుతాయని ప్రజలు బాధపడుతున్నారు. చెడిపోయిన రోడ్డును మరమ్మతులు పనులు చేయకపోవడం ప్రజాప్రతిని నిర్లక్ష్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, పై అధికారులు స్పందించి తగిన మెరుగైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఏకచక్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బోధన్ ఏకచక్రేశ్వర శివాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో మహశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 26న మహ శివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నేటి నుండి 27వ తేదీ వరకు కొనసాగుతాయని శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి పేర్కొన్నారు. వేద పండితులు గణేష్ మహరాజ్ మంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, మహన్యాస పూర్వక లఘు రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు గణేష్ మహరాజ్ మాట్లాడుతూ శివ నామస్మరణతో సకల శుభాలు కలుగుతాయని, బోధన్ ఏకచక్రేశ్వర శివాలయం చరిత్రను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సింగం లక్ష్మణ్, కమల భూమేష్, కవిత, సంజీవ్ కుమార్, సూర లింగం, నాగేష్, దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి ఎస్.రాములు, వేద పండితులు మహేష్ పాఠక్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఏకచక్రేశ్వర శివాలయంలో బ్రహ్మోత్సవాల దృశ్యం

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని కొండపై చుట్టు ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



తొర్లికొండ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శివపార్వతులతో పాటు ఇతర విగ్రహాల ఏర్పాటుకు తీసుకువచ్చిన దృశ్యం

భక్తి



• బిచ్కుందలో ముమ్మరంగా సాగుతున్న కైలాస పర్వతం సెట్టింగ్ ఏర్పాట్లు

శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు

బిచ్కుంద, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహ శివరాత్రి రోజు శివపార్వతుల కళ్యాణమహోత్సవం నిర్వహించేందుకు స ద్గురు బండాయప్ప మఠాధిపతి సో మలింగ శివచార్య మహాస్వామిజీ కైలాస పర్వతం భారీ సెట్టింగ్‌లను ఏర్పాట్లు చేస్తున్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన మఠసంస్థాన్‌కు మ హారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొననున్నా రు. శివరాత్రికి మూడు రోజుల ముందుకు తర్వాత మూడురోజుల పాటు మఠ సంస్థాన్ ప్రాంగణమంతా సందడి నెలకొంటుంది. మహాశివరాత్రి లింగోద్భవం సందర్భంగా స్టేజిపై 25 అడుగుల పరమశివుని ప్రతిమను ప్రతిష్ఠించి స్టేజికి ఇరువైపులా గజరాజులు స ర్వేశ్వరుడైన శివపార్వతుల కుటుంబసమేత ప్రతి ఏర్పాటుచేస్తున్నారు. సద్గురు బండాయప్ప మఠసంస్థానం, కాశీ విశ్వనాథ్ శివాలయ ప్రాంగణ ఆవరణ మొత్తం విద్యుత్ కాంతులతో పాటు శివపార్వతుల కళ్యాణ మహోత్సవ సెట్టింగ్‌కు దాదాపు 25 లక్షల వ్యయంతో అంగరంగ వైభవంగా భక్తులందరికి కనుల పండుగ నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లలో మఠాధిపతి నిర్వహకులు సిబ్బంది నిమగ్నమయ్యారు. మహాశివరాత్రి ఉత్సవ వేడుకలలో భక్తులందరూ పాలాభిషేకం చేసే సౌకర్యం కల్పించడం జరుగుతుందని భక్తులందరూ ఈ మహోత్సవ వేడుకలలో పాల్గొని శివపార్వతుల దివ్యఆశీస్సులు పొందాలని మఠాధిపతి నిర్వహకులు తెలిపారు.

శివనామస్మరణతో మార్మోగనున్న దోమకొండ

● ఉత్సవాలకు హాజరుకానున్న పెద్దఎత్తున భక్తులు ● భక్తుల సౌకార్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ

దోమకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దోమకొండ మండల కేంద్రం భక్తుల శివనామస్మరణతో మర్మోగనుంది. శివ రాంమందిర్ ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు అభిషేకాలు ఎదురుకోల్లు, గంగాన్నపూరణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం, అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు రాత్రి నిశిపూజ, దిష్టికుంభాలు, స్వామివారి రథారోహణ, గంగన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, సీతారామచంద్ర స్వామివార్లను రథలపై ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్, హైద్రాబాద్, ఉమ్మడి జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని ముంబాయి. నాందేడ్ నుంచి భక్తులు భారీగా రానున్నారు. కామీనేని వంశస్థులైన అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాసనతో పాటు హీరో రాంచరణ్ కుటుంబ సభ్యులు గడికోటలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం కోటలో హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులు, కవులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు దోమకొండకు చెందిన ఆయా పాఠశాల విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వీక్షించిన అనంతరం రథాలు, ప్రయాణ ప్రాంగణం ఆవరణలోకి చేరుకుంటాయి. భక్తులు అక్కడికి చేరుకుని లంకదహనం కార్యక్రమాన్ని వీక్షించి అనంతరం ఉపవాసాలతో వచ్చిన భక్తులు శివనామస్మరణతో మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీతో పాటు దోమకొండ, బీబీపేట భిక్కనూర్ పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహిస్తారు. చక్కెర తీర్థం వరకు దోమకొండ శివనామస్మరణతో మర్మోగనుంది.



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

• ఎలా వెళ్లాలి

కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి దోమకొండ 18 కిలోమీటర్లు దూరం ఉంటుంది. భక్తుల సౌకార్యర్థం ఆర్టీసీ అధికారులు కామారెడ్డి నుంచి దోమకొండకు ప్రత్యేక బస్సులు నడుపుతారు. 30 నిమిషాల సమయంలో దోమకొండకు చేరుకోవచ్చు. బస్టాండ్ నుంచి శివరాం మందిర్ ఆలయం, గడికోట దగ్గరలోనే ఉంటుంది.

భక్తులకు అన్ని వసతులు కల్పించాం

• కొండ అంజం, ఆలయ కమిటీ చైర్మన్

శివరాం మందిర్ ఆలయంలో భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేశాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, పోలీస్, ఆర్టీసీ అధికారుల సమన్వయంతో పూర్తి వసతులు కల్పించాం. రథాలు ప్రయాణ ప్రాగణం లంకదహనం కార్యక్రమం వరకు భక్తులకు ఇబ్బందుల్లేకుండా జగ్రాత్తలు తీసుకున్నాం.

• నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

23 నుంచి 27 వరకు శివరాత్రి బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొండ అంజం తెలిపారు. 23న ఉదయం నుంచి ప్రదోశ పూజ, గణపతి పూజ, పుణ్యవహచనము, ఆఖండ దీపారదన, 24న ఉదయం నుంచి ప్రాతకాలపూజ, మాతృకా, యోగిని, వాస్తు క్షేతపాలక, అగ్నిప్రతిష్ఠ, 25న స్థాపిత దేవత హవణము, పూజలు, శేషశాయిపై స్వామివారి ఊరేగింపు, 26న భక్తుల అబిషేకాలు, ఎదురుకోల్లు, గంగాన్నపూర్ణ సమేత, విశ్వేశ్వర స్వామివారి కల్యాణోత్సవం అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు, రాత్రి 1.10 నిమిషాలకు నిషిపూజ, దిష్టికుంభాలు, స్వామివారి రథారోహణ, గంగాన్నపూర్ణ సమేత, విశ్వేశ్వర స్వామి, సీతారామచంద్రస్వామి వార్లు రథములపై స్థానిక ప్రయాణ ప్రాంగణం వద్దకు బయలుదేరుట, లంకదహనం అనంతరం రథాలు ఆలయానికి ప్రవేశించుట, 27న ఉదయం నుంచి చక్కెరతీర్థం(జాతర), నాకబలి, పూర్ణాహంతి వివిధ కార్యక్రమాలు జరుగును.

55 వేల ఉద్యోగాలను ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

లింగంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగుల కోసం సంవత్సర కాలంలో 55వేల ఉద్యోగాలను ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీసెల్ ప్రధా నకార్యదర్శి రఫీయో ద్దీన్ అన్నారు. ఆయన శనివారం లింగంపేట మండలంలోని ఐలాపూర్‌లో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టభద్రులు తప్పనిసరిగా నరేందర్ రెడ్డికి మొదటిప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజు, టౌన్ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్ గౌడ్, దుర్గారెడ్డి, పోచయ్య, సంగయ్య, పరాందాములు, నగేష్, రాజు, ఎల్లమ య్య, రవిలతో పాటు నాయకులున్నారు.

కామారెడ్డిటౌన్ : పట్టభద్రుల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేస్తున్న ఉట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేందర్‌రెడ్డికి మొదటిప్రాధాన్యత ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్, నిఖిల్, సంపత్, జస్వంత్‌రాజ్ ఉన్నారు.

ఎల్లారెడ్డి : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎల్లారెడ్డి సొసైటీ వాయిస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వివిధ వార్డులలో ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్ల గడపగడపకు తిరిగి ప్రచారం నిర్వహించారు. అదే విధంగా ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ రుద్రారం గ్రామంలో గ్రాడ్యుయే ట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, సత్యం, సొసైటీ డైరెక్టర్ సిఖిందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్ , భూమయ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, నిరుద్యోగులకు బీజేపీతోనే న్యాయం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

లింగంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు నిరుద్యోగులకు బీజేపీతోనే న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపర్చిన అభ్యర్థులు టీచర్ ఎమ్మెల్సీకి కొమురయ్య, పట్టభద్రుల స్థానానికి అంజిరెడ్డిలకు మొదటిప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరుతూ శనివారం బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతికుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థులు టీచర్ ఎమ్మెల్సీకి కొమురయ్య, పట్టభద్రుల స్థానానికి అంజిరెడ్డికి మొదటిప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దత్తురాంలు, అనిల్, సాయితేజ, సాయిలు, ప్రవీణ్ నాయకులున్నారు.

తాడ్వాయి : బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా బీజేపీ నాయకులు మండలంలో జోరుగా ప్రచారం నిర్వ హిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా రాత్రి పగలు అని తేడా లేకుం డా బీజేపీ నాయకులు పనిచేస్తున్నారు పట్టబద్రుల ఓటర్లను దగ్గరకు వెళ్లి బీజేపీ బలపరిచిన అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని అం టున్నా రు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్ రెడ్డి, నాయ కులు రవీందర్రావు, లింగారావు, హోటల్ శ్రీను, దత్తు, రాజిరెడ్డి ఉన్నారు.

అల్లూరమ్మ ఆలయానికి సీసీ కెమెరాల వితరణ

లింగంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రాచీన మహిమాన్విత ఆలయం అల్లూరమ్మ ఆలయానికి శనివారం మెంగారం గ్రామానికి చెందిన భక్తుడు మంగళి విఠల్ సీసీ కెమెరాలను వితరణ చేశారు. ఆలయంలో ఇటీవల చోరీ జరగడంతో స్పందించిన భక్తుడు అమ్మవారి ఆలయ రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయంతో పాటు ఆలయ పరిసరాలు సీసీ కెమెరాలో రికార్డవుతాయని ఆయన తెలిపారు. ఇక ముందు అల్లూరమ్మ ఆలయం సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందని ఇక ముందు ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా భద్రంగా ఉంటుందని భక్తులు అంటున్నారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పదవికి రాజీనామా

మద్నూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు బాలు షిండే తెలిపారు. లిఖిత పూర్వకంగా పార్టీ కార్యాలయానికి రాజీనామా పత్రాన్ని పంపినట్లు వెల్లడించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పదవికి న్యాయం చేయలేకపోతున్నానని, తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం తనవంతు కృషిచేస్తానని పదవికి మాత్రం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ఎమ్మార్పీఎస్ పట్టణ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఎల్లారెడ్డి పట్టణ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు శివానందం తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా రొట్ట నరేష్, ఉపాధ్యక్షులుగా సాయిబాబా, కిషన్ భూమేష్ , సంతోష్, ప్రధాన కార్యదర్శి మర్లు సాయిలు, కోశాధికారి కిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాశి రాం, సలహాదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పద్మారావు పాల్గొన్నారు.

వైభవంగా నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

బాన్సువాడటౌన్ , ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భేతాళ స్వామి కాలనీలో నల్లపోచమ్మ విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో హోమాలు, కుంకుమార్చన కార్యక్రమాలు జరుగుతున్నాయి. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు చేపట్టారు. చివరిరోజు ఆదివారం హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీస్వామి విచ్చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

కనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

బాన్సువాడటౌన్ , ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో గల శ్రీ కనకదుర్గాదేవి ఆలయ మొదటి వార్షికోత్సవం అంగరంగవైభవంగా సాగింది. ఉదయం నుంచి వేదపండితులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం భక్తుల కోసం ఆలయ ధర్మకర్త పోచారం ప్రేమల శంభురెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.

గడికోటలో ఉర్దూ సాహిత్య సమావేశం

దోమకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గడికోటలో శనివారం ఉర్దూసాహిత్య సమావేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉర్దూపండితులు ఉర్దూ ప్రత్యేకతను వివరించారు. కార్యక్రమానికి పలువురు వక్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో కోటమేనేజర్ బాబ్జి, గణేష్ యాదవ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



మద్నూర్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

మద్నూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ కేంద్రాలను మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, ఎస్సై విజయ్ కొండ పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మద్నూర్ మండలంలో417మంది పట్ట భద్రులు, 49 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం తగిన విధంగా సిబ్బందిని ప్రభుత్వం నియమించినట్లు పేర్కొన్నారు. వారితోపాటు స్థానిక ఉపాధ్యాయులు శివ కాంత్ తదితరులు ఉన్నారు.

● డోంగ్లిలో 118 ఓటర్లు

డోంగ్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రేణుకాచౌహాన్ వెల్లడించారు. పట్టభద్రుల ఓటర్లు 107 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 11 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు జరిగినట్లు పేర్కొన్నారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

● 8 లక్షల రూపాయల ఆస్తి నష్టం


కాలిబూడిదైన ఇల్లు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ప్రమాద వశాత్తు అగ్నిప్రమాదం సంభవించి నివాసపు పూరిగుడిసె దగ్ధమై 8 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్టు తహసిల్దార్ శ్రీనివాస్ రావు తెలిపారు. గ్రామానికి చెందిన పుల్లమానెమ్మకు చెందిన నివాసపు గుడిసె ఈ అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. పుల్లమానెమ్మ, ఆమె చెల్లెలు పద్మ లిద్దరు శుక్రవారం రాత్రి తమ పూరిగుడిసెలో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి సమయంలో అన్ని ప్రమాదం సంభవించింది. దీంతో వెంటనే స్థానికులు ఎల్లారెడ్డి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదంలో కుటుంబ సభ్యులు ఇంట్లో దాచుకున్న సుమారు 6 లక్షల రూపాయల నగదు, ఒక తులం బంగారం, 20 తులాల వెండి, బీరువా, సైకిల్ ఇతర సామగ్రి, వంట సామగ్రి మొత్తం కాలి బూడిదైందని కుటుంబసభ్యులు తెలిపారు. ప్రమాదం సంభవించిన వెంటనే కుటుంబ సభ్యులు ఇంటి బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది. కుటుంబ సభ్యులకు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అగ్ని ప్రమాదం సంఘటన విషయం తెలుసు కున్న డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, ఎస్సై మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కార్తీక్ తదితరులు శనివారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం వల్ల భారీ ఆస్తి నష్టం జరిగినందున తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'శివాజీ స్ఫూర్తితో పనిచేయాలి'


మద్నూర్‌లో పాల్గొన్న గ్రామస్తులు

మద్నూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జై భవానీ వీర శివాజీ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆయన పోరాట స్ఫూర్తిని గుండెల్లో నింపుకొని పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు హనుమాన్లు స్వామి, మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, బండిగోపి, హనుమాన్లు, లైదల్ రవి, రాములు, కృష్ణ పటేల్, చాట్ల హనుమాన్లు, సంతోష్, రౌతువార్ నగేష్, గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగల అరెస్టు


నిందితులతో పోలీసులు

తాడ్వాయి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగోజీవాడి గ్రామంలో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలో రాత్రి పూట ఇళ్ల తాళాలు బంగారం, వెండి అభరణాలను నగదును చోరీచేసిన దోమకొండ సాయిలు గడ్డం బాలరాజులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఏడుగ్రాముల బంగారం, పదితులాల వెండి, సౌండ్‌బాక్సు, 300 రూపాయలను స్వాధీనపర్చుకొని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

చోరీ కేసులో ఓ వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం డిసెంబర్ 16వ తేదీన ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి, కొట్టాల గ్రామాలలో అర్ధరాత్రి పిల్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారని, ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేయగా మెదక్ జిల్లా వాసి జ్ఞానసింగ్, మరో ఇద్దరు గుజరాత్‌కు వ్యక్తులు కలిసి చోరీకి పాల్పడ్డారని తెలియడంతో, వారి వద్ద నుంచి 50 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకొని మొదటి నేరస్తునిగా జ్ఞానసింగ్‌ను కామారెడ్డి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. దర్యాప్తులో ఎస్సైకి చాకచక్యంగా కృషి చేసిన ఇద్దరు ఇద్రీస్, వెంకటరమణ, కానిస్టేబుల్‌లను పోలీసులు అభినందించారు.

రేపు ప్రజావాణి రద్దు

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతిసోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 24న నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శాసన మండలి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఈ నిర్ణం తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రజల విజ్ఞాపనలు తీసుకోవడానికి కలెక్టరేట్‌లోని రూంనంబర్ 25లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

అడ్లూర్ విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో మంటలు


సబ్‌స్టేషన్‌లో చెలరేగుతున్న మంటలు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ సబ్‌స్టేషన్‌లో శనివారం మంటలు చెలరేగాయి. సబ్‌స్టేషన్‌లోని కెపాసిటర్ బ్యాంక్‌లో మంటలు చెలరేగడంతో ట్రాన్స్‌ఫార్మర్ సెల్స్ బ్లాస్ట్ అయ్యాయి. దీంతో సబ్‌స్టేషన్ సిబ్బంది అధికారులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం చేరవేయడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఎస్ఈ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లోపెద్దగా ప్రమాదం ఏమి చోటుచేసుకోలేదని సెల్స్ కొత్తవి అమర్చి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం 9.19 లక్షలు


టీటీడీలో హుండీ డబ్బులు లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బీర్కూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శనివారం శ్రీవారి హుండీ ఆదాయాన్ని ఆలయ కమిటీ సభ్యులు లెక్కించారు. అయితే హుండీ ఆదాయం 9 లక్షల 19 వేల 900 రూపాయల ఆదాయం సమ కూర్చినట్లు సభ్యులు తెలిపారు. నాలుగు నెలల పదిహేను రోజుల అనంతరం హుండీ ఆదాయం లెక్కించనున్నారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కోసం వినియోగించనున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దినేని నాగేశ్వర్‌రావు, నర్సరాజు, కిరణ్, శ్యామ్, ఆలయ అర్చకులు నంద కిషోర్, రాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 4 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో మార్చి 4 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పురుగుల మందు తాగిన ఇద్దరు చిన్నారులు

రామారెడ్డి,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం స్కూల్ తండాకు చెందిన ఇద్దరు చిన్నారులు పురుగుల మందు తాగి అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం స్కూల్ తండాకు చెందిన గంగావత్ మంత్యానాయక్ కూతురులైన 8 సంవత్సరాల గంగావత్ సంజన, 6 సంవత్సరాల గంగావత్ బిందులు శనివారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన తర్వాత పంటపొలాలకు వినియోగించే పురుగుల మందు ఇంట్లో ఉండడంతో వాటిని తీసుకుని తాగారు. కొద్దిసేపటికి తీవ్ర అస్వస్థతకు గురికాగా తల్లిదండ్రులు గమనించి వారిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నారని గ్రామస్తులు తెలిపారు.

తప్పుడు ఫిర్యాదుతో ప్రైవేట్ అధ్యాపకుల ఓట్లు తొలగించారు

● లెక్చరర్‌ఫోరం నాయకుల ఆరోపణ


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు బాలు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అనామకులతో అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేయించి ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయుల పేర్లను తొలగించారని లెక్చరర్‌ఫోరం అధ్యక్షుడు బాలు అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లుగా ఉన్నవారిని ఓ ఉపాధ్యాయసంఘం తప్పుడు ఫిర్యాదు చేయించి తమ ఓట్లను తీయించిందని, దీనివలన 350 మంది తుది జాబితాలో ఉన్న టీచర్ ఎమ్మెల్సీ ఓటు కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు అమూల్యమైన ఓటు హక్కును కోల్పోవడం జరిగిందని అన్నారు. ఈ లెక్కన కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగా అధ్యాకులు, ఉపాధ్యాయుల ఓటుహక్కును కోల్పోయారని, తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై విచారణ చేపట్టాలని, ఓటు కలిగిన వారికి కనీసమైన సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించడం సరికాదని దీనిపైన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

సంగమేశ్వరాలయానికి దారి కల్పించాలని వినతి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ పుష్పరాజ్

రాజంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో ఉన్న సంగమేశ్వరాలయానికి దారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నిర్మించిన ఆర్అండ్‌బీ బ్రిడ్జీ వల్ల సంగమేశ్వరాలయానికి దారిమూసుకుపోవడంతో పంటపొలాలకు ఆలయానికి దారి పక్కనే ఉన్న లావన్ పట్టాభూముల నుంచి ఇవ్వాలని కోరుతున్నామన్నారు. గ్రామంలో ప్రతి శివరాత్రికి ఆలయంలో జాతర జరుపుకుంటామని, దానికి దారి కల్పించాలన్నారు. దీంతో ఇరువర్గాల వారిని ఎస్ఐ పుష్పరాజ్ స్టేషన్‌కు పిలిపించి గుడినుంచి కాలువ వరకు దారి ఉన్నందున గత సంవత్సరం క్రితం గుడి నుంచి కాలువ వరకు సీసీరోడ్డు వేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం కాలువ కోతకు గురికావడంతో దారి కాలువలో కలిసిపోయిందని, జాతర జరిగే సమయంలో కాలువ పక్క పొలం వారితో మాట్లాడి జాతరకు సీసీరోడ్డు వరకు దారి ఇచ్చేందుకు ఒప్పించామని తెలిపారు. గుడివెనకాల పొలంవారు ఆ దారి పర్మినెంట్ చేయాలని చాలారోజుల నుంచి కార్యాలయాల చుట్టు తిరుగుతున్నామని, తక్షణమే సమస్య పరిష్కరించమని సంబంధిత శాఖాధికారులు వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం


అదృశ్యమైన తల్లీపిల్లలు

తాడ్వాయి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన రేవతి ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమయ్యారు. రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి పిల్లలను తీసుకుని బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు పలుప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని బాధిత కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే 9346430336, 63035 0664 నెంబర్లకు ఫోన్ చేయగలరని గ్రామస్తులు, బాధితులు తెలిపారు.

ఎల్లారంలో వైద్యశిబిరం


ఎల్లారంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

బిచ్కుంద, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారం గ్రామంలో చికెన్‌గున్యా, వైరల్ ఫీవర్‌లతో ప్రజలు బాధపడుతుండడంతో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించి అనారోగ్యం బారినపడిన వారికి చికిత్సలతో పాటు మందులు అందించారు. ప్రజలకు పూర్తిగా నయం అయ్యేవరకు క్యాంపును కొనసాగించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

భిక్కనూరులో కారు ప్రమాదం

భిక్కనూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని 44వ జాతీయరహదారి బైపాస్‌పై పోలీసుస్టేషన్ వెనుకాల ప్రమాదవ శాత్తు కారు రోడ్డుకిందకు దూసుకుపోయి బోల్తాపడింది. కర్ణాటకకు చెందిన ఐదుగురు కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా భిక్క నూరు వద్ద కారు అదుపుతప్పి రోడ్డుకిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో కారు లో ఉన్న ఐదుగురికి స్వల్పగాయాలు కాగా పోలీసులు వారిని చికి త్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాన్సువాడ యువకుడి మృతి

బాన్సువాడటౌన్ , ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో బాన్సువాడ పట్టణానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. బాన్సువాడ పట్టణానికి చెందిన సందీప్ (33) హైదరాబాద్‌లో రికార్డ్ అసిస్టెంట్ బాధ్యతలను నిర్వర్తించేవాడు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డుప్రమాద ఘటనలో సందీప్ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పెద్దమల్లారెడ్డిలో సైన్స్‌ఫేర్


సైన్స్ ఫేర్‌ను పరిశీలిస్తున్న డీఈవో

భిక్కనూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని డీఈవో రాజు ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, నోడల్ అధికారి శ్రీనా థ్, ఏఎంవో వేణుశర్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రతీ విద్యార్థి మంచి మార్కులు సాధించాలి'

భిక్కనూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతివిద్యార్థి బాగా చదివి మంచిమార్కులు సాధించాలని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ స్వామి, విండో చైర్మన్ రాజాగౌడ్ అన్నారు. శనివారం పెద్దమల్లా రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో మెజీషియన్ సంతోష్ ప్యాడ్‌లు, పెన్నులను వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - చావా
ప్రియా 70 - రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్
ప్రియా 35 - తండేల్

బాన్సువాడ

మహేశ్వరి - తండేల్
వెంకటేశ్వర - రామం రాఘవం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

